సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



సమస్యలు ఇలా..పరిష్కారమెలా?

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలే మళ్లీ వస్తున్నా పరిష్కారానికి నోచుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. - 8లో



బాల్యవివాహాలు నివారిద్దాం

బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పిలుపునిచ్చారు. - 8లో

మరీ ఇంత నిర్లక్ష్యమా?



పలమనేరులో స్మార్ట్ రేషన్ కార్డుల జారీలో అధికారులు అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. దీనిపై కొందరు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఉచిత పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 2025–26 సంవత్సరానికి సంబంధించి ఉచిత పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి తెలిపారు. ఇంటర్‌లో 40శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు www.appmb.co.in అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ



సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : అర్బన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో నగరపాలక, మున్సిపాలిటీ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనుల పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఏ మాత్రం అలసత్వం వహించినా చర్యలు కఠినంగా తప్పవని హెచ్చరించారు. పలమనేరు, పుంగనూరు మున్సిపాలిటీలకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో మౌలిక వసతుల పెంపునకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారు?.. వీధి లైట్లు ఎన్ని మరమ్మతులు చేయాలి ?.. తదితర వివరాలను వార్డుల ప్రకారం నివేదికలు సిద్ధం చేసి అందజేయాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కమిషనర్ సందర్శించి అక్కడ అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో కమిషనర్లు నరసింహప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, ఏవీ రమణారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అదిరింది'గురూ'!

– రాష్ట్ర స్థాయి అవార్డులకు ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక



రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైన నౌషద్ అలీ, శరత్‌చంద్ర

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ఉత్తమ బోధన చేసినందుకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లాలోని గుడిపాల మండలం, నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.నౌషద్‌అలీ, ఎస్‌ఆర్ పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శరత్‌చంద్ర రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఆ ఇద్దరూ శుక్రవారం విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవం కార్యక్రమంలో అవార్డులు స్వీకరించనున్నారు.

చిత్తూరులో డీఐఎన్‌సీ ఏర్పాటుకు కసరత్తు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో డీఐఎన్‌సీ (డిజిటల్ నెర్వ్ సెంటర్) ఏర్పాటుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ సుమిత్ కుమార్ ఆ శాఖ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇదివరకే కుప్పంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఏడు పీహెచ్‌సీలను ఈ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని చిత్తూరు జిల్లా కేంద్రంగా ఈ సెంటర్ నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టారు. చిత్తూరులో ఏర్పాటు చేసే సెంటర్‌కు కుప్పం సెంటర్ మదర్ బోర్డుగా పనిచేయనుంది.



అశ్వ వాహనంపై వరసిద్ధుడి అభయం

- కాణిపాకంలో నేత్రపర్వంగా వార్షిక బ్రహ్మోత్సవాలు
- వైభవంగా తిరుకల్యాణోత్సవం

కాణిపాకం: కాణిపాక స్వయంభు శ్రీవర సిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి అశ్వ వాహనంపై ఊరేగుతూ అభయమిచ్చారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సేవకు తిరువణంపల్లె, 44 బొమ్మసముద్రం, చింతమాకులపల్లె, కారకాంపల్లె గ్రామాలకు చెందిన గోనుగుంట, బలిజ వంశీయులు ఉభయదారులు వ్యవహరించారు. తిరుకల్యాణోత్సవం సందర్భంగా భిక్షాండి కార్యక్రమం నిర్వహించారు. కల్యాణానికి పూజాసామగ్రిని సమకూర్చుకోవడా నికి శివపార్వతులు గ్రామంలో భిక్షాటన చేయడం ఆనవాయితీ. అనంతరం ఉభయదేవేరీలతో కూడిన వినాయకుడి తిరుకల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు. తదనంతరం ప్రారంభమైన అశ్వ వాహన సేవలో మండపం వద్ద ఆనవాయితీ ప్రకారం స్వామి వారు నిలువు దోపిడీకి గురు య్యారు. స్వామి ఆభరణాలు, నైవేద్యం, అత్తవారు కట్టించిన ఉంగ్రాళ్లు, చిల్లర, కాసులను దొంగలు దోపిడీ చేసే ఘట్టాన్ని కన్నుల పండువగా జరిపించారు.



సాంస్కృతిక సంబరం



తిరుకల్యాణోత్సవం

నేడు ఉత్సవాలు ఇలా..

వరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం, వడాయత్తు ఉత్సవం, రాత్రి ఏకాంతసేవ జరగనుంది. దీంతో గణనాథుని బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయని, మరుసటి రోజు నుంచి ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈఓ పేర్కొన్నారు.

టీటీడీ తరఫున పట్టు వస్త్రాల సమర్పణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వినాయకస్వామికి టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్.నాయుడు పట్టువస్త్రాలను సమర్పించారు. ఊరేగింపుగా వచ్చి స్వామికి పట్టువస్త్రాలు అందజేశారు. వారికి ఆలయ ఈఓ పెంచలకిషోర్ స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ ఈఓను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు.



టీటీడీ తరఫున పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చైర్మన్ బీఆర్.నాయుడు



తరగతి గది ఒక ప్రసూతి గది.. జ్ఞానానికి జన్మనిచ్చేందుకు
తరగతి గది ఒక శ్మశాన వాటిక...అజ్ఞానాన్ని ఖననం చేసేందుకు
తరగతి గది ఒక కర్మాగారం.. జాతి భవితను నిర్మించేందుకు
తరగతి గది ఒక న్యాయస్థానం... సరైన నిర్ణయాలు తీసుకునేందుకు
– సర్వేపల్లి రాధాకృష్ణన్

పిల్లలు నచ్చేలా.. పదుగురు మెచ్చేలా!

ఉపాధ్యాయుడు అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి విజ్ఞానమనే వెలుగును ప్రసాదిస్తాడు. తాను వెలుగుతూ ప్రపంచాన్ని వెలిగిస్తాడు. అక్షర పూదోటలో తోటమాలిగా.. విద్యార్థి జీవితానికి మార్గదర్శిగా నిలుస్తాడు. అలాంటి వృత్తినే దైవంగా భావించారు కొందరు గురువులు. కటిక పేదరికంలో మగ్గుతున్నా ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకున్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో అర్హత సాధించి సత్తా చాటారు. అదేవిధంగా జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు చదువు చెప్పడమే కాదు.. సమాజంలో ఎలా బతకాలో విద్యార్థులకు నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం..

- బోధనపై మక్కువతో ఉపాధ్యాయవృత్తిలోకి
- పేదరికాన్ని జయించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక
- నేడు జెడ్పీలో జిల్లా స్థాయి గురుపూజోత్సవం
- అవార్డులు అందుకోనున్న 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్ : గురుబ్రహ్మ.. గురు విష్ణు.. గురుదేవో మహేశ్వర.. గురు సాక్షాత్ పరబ్రహ్మ.. తస్మై శ్రీ గురువేనమః సమాజంలో గురువులకు ఉన్న ప్రాధాన్యత అలాంటిది మరి. తల్లిదండ్రుల తర్వాత పూజింపబడేది.. గౌరవం ఇచ్చేది వారికే కదా.. తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు చేయిపట్టి అక్షరాలు దిద్దించి ఉన్నతులుగా తీర్చిదిద్దుతారు. క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత అంటే ఏంటో నేర్పిస్తారు. విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తారు. వారి అడుగుజాడల్లో నడిచి ఎంతోమంది ప్రయోజకులుగా ఎదిగారు. అదేవిధంగా ప్రస్తుతం డీఎస్సీలో ఎంపికైత్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బోధించనున్నారు. కొంతమంది టీచర్లు మొక్కుబడిగా కాకుండా అటు విధి నిర్వహణతో పాటు ఇటు తాము పనిచేస్తున్న పాఠశాలలను సమోన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నేడు జిల్లా స్థాయిలో జెడ్పీ సమావేశ మందిరంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించనున్నారు. జిల్లాలోని ఉత్తమ విద్యాబోధన చేస్తున్న 70 మంది టీచర్లను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వారిని నేడు సత్కరించి అవార్డులను అందజేయనున్నారు.

పట్టు వదలని విక్రమార్కుడు!



నాది అనంతపురం జిల్లా, గుత్తి మండలం, ఎర్రగుడి గ్రామం. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తుంటారు. డీఎస్సీకి చిత్తూరులోనే శిక్షణ పొందాను. 15 ఏళ్ల తర్వాత నా ఆశయం నెరవేరింది. డీఎస్సీలో నాకు 82.48 మార్కులు వచ్చాయి. నా తల్లిదండ్రుల నమ్మకం నెరవేరింది. – తల్లిదండ్రులతో మోట ప్రశాంత్

మారుమూల గ్రామంలో జన్మించి



నాది చిత్తూరులోని కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండలంలోని పెద్ద కురబలపల్లె. మెగా డీఎస్సీలో 86.36 మార్కులు వచ్చాయి. ఈ విజయానికి కారణం నా తల్లిదండ్రుల శ్రమే. సంవత్సరాల తరబడి కుటుంబానికి దూరంగా ఉంటూ శిక్షణ పొందాను. – తల్లిదండ్రులతో డీఎస్సీ అభ్యర్థి రమేష్

కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం





కార్యక్రమానికి హాజరైన నాయకులు, సదుం: మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- రాష్ట్రానికే పుంగనూరు ఆదర్శం కావాలి
- నియోజకవర్గ నేతల సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల ఏర్పాటులో రాష్ట్రానికి పుంగనూరు నియోజకవర్గం ఆదర్శం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎర్రాతివారిపల్లెలో నియోజకవర్గ నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా పైలెట్ ప్రాజెక్టుగా పుంగనూరును ఎంపిక చేసి, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీలు ఇక కీలకం కానున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అములులో వారికే ప్రాధాన్యం ఇస్తామన్నారు. కమిటీ సభ్యులు చురుగ్గా ఉంటూ.. పార్టీ కార్యక్రమాలను సోషయల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని ఆయన పులుపునిచ్చారు. గ్రామాలలో నాయకుల మధ్య ఉండే స్పర్థలు వీడాలని, అందరికీ తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.

ఎవరికి ఇబ్బంది కలిగించినా..!

వెంట నడుస్తున్న ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకూ తమ కుటుంబం అండగా ఉంటుందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఎవరికి ఇబ్బంది కలిగించినా తాను వదిలేది లేదని స్పష్టం చేశారు. పుంగనూరుకు ఉన్న ప్రత్యేక పేరును నిలిపేలా కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

ఎవరూ భయపడాల్సిన పనిలేదు

రొంపిచెర్ల: కార్యకర్తలకు తాను అండగా ఉంటానని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. రొంపిచెర్ల మండలం, పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీ, మేకలవారిపల్లెలో ఆయన పర్యటించారు. కార్యకర్తలెవ్వరూ భయపడాల్సిన పనిలేదన్నారు. వారికి ఏకష్టం వచ్చినా తాను అండ గా ఉంటానని స్పష్టం చేశారు. పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె సరిహద్దులో నిర్మించిన బడబళ్ల వంక ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం మంజూరు చేయించాలని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రంరెడ్డి గృహ ప్రవేశానికి హాజరయ్యారు. అలాగే తల్లి మృతి చెందిన మదనమోహన్‌రెడ్డి కు టుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, చెంచురెడ్డి, సద్దారామిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, యుగంధర్‌రెడ్డి, కోట వెంకటరమణ, శ్రీనాథనాయుడు, విజయశేఖర్, కరీముల్లా, మహబుబ్‌బాషా, అల్లాభక్స్, బావాజాన్, హరికృష్ణారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రామనారాయణ రెడ్డి, కరుణాకర్, వెంకటరమణారెడ్డి, చిన్న రెడ్డెప్పరెడ్డి, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊహించని స్పందన

గ్రామ కమిటీలకు తమ అంచనాలకు మించి స్పందన వస్తున్నట్లు పార్టీ ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి తెలిపారు. వివిధ కమిటీలలో స్థానం కోసం స్వచ్ఛందంగా పలువురు ముందుకొస్తున్నారన్నారు. 6, 7, 8 తేదీలలో మండల స్థాయిలో కమిటీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28న రచ్చబండ పేరుతో 142 పంచాయతీలు, 31 వార్డులలో ఏకకాలంలో జూమ్ సమావేశాలు జరుగుతాయన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, సదుం, సోమల, పులిచర్ల, రొంపిచర్ల మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ కన్వీనర్లు, వివిధ విభాగాల శ్రేణులు హాజరయ్యారు.

కష్టాల్లో రైతులు

- ఎరువులు, యూరియా కోసం బారులు
- వాస్తవాలు వెలుగులోకి తెస్తే 'సాక్షి'పై కేసులా?
- పచ్చ పత్రికల్లోనూ యూరియా లేదని ప్రచురితం కాలేదా?

– చంద్రబాబు, పవన్‌కు మాజీ మంత్రి ఆర్కేరోజా సూటి ప్రశ్న



'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాన్ని చూపుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : ప్రస్తుత పాలనలో రాష్ట్ర వ్యాప్తకంగా రైతులు అష్టకష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. రైతులు పడుతున్న కష్టాలపై గురువారం నగరిలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎరువులకు, యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు చెప్పనలవికావన్నారు. సరిచెయ్యాల్సిన ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి వారి చేతకాని తనాన్ని వాస్తవాలు బయటపెట్టే 'సాక్షి'పై చూపిస్తున్నారన్నారు. క్యాబినేట్ మీటింగ్ పెట్టుకొని ఫేక్‌ల పనిపడతాం అంటూ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. 'సాక్షి'లో కథనం వచ్చిన రోజునే పచ్చ పత్రికల్లో యూరియా ఏదయ్యా, యూరియా వెతలు అంటూ కథనాలు వచ్చాయని ఇది అవాస్తవమైతే ఆ పత్రికలపై ఎందుకు కేసులు పెట్టడం లేదన్నారు. కుప్పం, పిఠాపురం నియోజకవర్గంల్లోనూ రైతులు ఎరువుల కోసం రైతులు బారులు తీరుతున్నారని, దీనికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సిగ్గుపడాలన్నారు. రైతులకు రూ.25 వేలు ఇస్తానని చెప్పిన మీరు 15 నెలల పాలనలో ఇచ్చింది రూ.5 వేలే అన్నారు. ఇది రైతులను మోసం చేయడం కాదా అన్నారు.

వెలుగులు నింపేది టీచర్లే

వి.కోట: మంచి సమాజాన్ని నిర్మించాలని అహర్నిశలు శ్రమిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం తాను కరిగిపోతూ వెలుగునిచ్చేది ఉపాధ్యాయులేనని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. గురువారం పట్టణంలోని మెయిన్ స్కూల్ (ప్రాథమిక పాఠశాల)లో ఎంఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపలిల్ రాధాకృష్ణ అడుగుజాడల్లో నడిచి విద్యార్థులకు బంగారు భవిష్యత్తును కల్పించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు చంద్రశేఖర్, మురుగేష్, ఎంపీడీఓ ఈశ్వరన్ పాల్గొన్నారు.




ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు

'ముందే' కూసింది!

మూడు నెలల ముందే సర్పంచ్ ఎన్నికలు

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్



చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పంచాయతీరాజ్‌శాఖకు ఎస్‌ఈసీ లేఖలు పంపింది. స్థానిక సంస్థల ఎన్నికల పై రాష్ట్ర ప్రభుత్వం సైతం ముందుస్తుగా వెళ్లాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్లు జిల్లా అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేసింది. సర్పంచుల పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్‌తో ముగియనుంది. కానీ మూడు నెలల ముందే ఎన్నికల నిర్వహణకు చట్టంలో ఉన్న వెసులుబాటు మేరకు కసరత్తును ప్రారంభించింది.

సజావుగా సాగేనా?

క్షేత్ర స్థాయిలో రెడ్ బుక్ పేరుతో ఏకగ్రీవం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి పాలనలో ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎలా బెదిరింపులకు పాల్పడ్డారో అందరికీ తెలిసిన విషయమే. దానికితోడు టీడీపీ, జనసేన, బీజేపీలోనూ ఆశావాహులు ఎక్కువగా ఉన్నారు. ఏ పార్టీ మద్దతుదారులకు సర్పంచ్‌గా అవకాశం ఇస్తారో తెలియని పరిస్థితి.

జిల్లా సమాచారం

పంచాయతీలు	696	గ్రామీణ జనాభా	14,63,661 మంది
వార్డులు	6,220	ఓటర్లు	10,91,739 మంది

ఎన్నికల షెడ్యూల్

అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలి. 16 నుంచి నవంబర్ 15వ తేదీలోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రచురించాలి. నవంబరు 1–15 లోగా ఎన్నికల అధికారుల నియామకం పూర్తిచేయాలి. 16–30లోగా పోలింగ్ కేంద్రాలు ఖరారు, ఈవీఎంలు సిద్ధం చేయడం, సేకరణ వంటివి పూర్తిచేయాలి. డిసెంబర్ 15 లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి. డిసెంబర్ చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి. 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి, అదే నెలలో ఫలితాలు ప్రకటించాలి.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. ఇలాంటప్పుడు ల్యాబ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాల లక్షణాలు కనిపిస్తే..రక్త పరీక్షలు చేయించాలన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలు



పోలీసుల అదుపులో మహేంద్ర

వెదురుకుప్పం: ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలు శిక్ష పడినట్టు స్థానిక ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. సత్యవేడు మండలం, రాజగుంట గ్రామానికి చెందిన నటరాజ్ కుమారుడు మహేంద్ర(48) ఎర్రచందనం దొంగతనం కేసులో ముద్దాయి అని, ఈ మేరకు అతనికి ఐదేళ్లు జైలు శిక్ష పడినట్టు ఆయన వెల్లడించారు.

చిరుత దాడిలో ఆవు మృతి



మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న బీట్ ఆఫీసర్

చౌడేపల్లె: చిరుత పులి దాడిలో ఆవు మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పరికిదొన పంచాయతీ, సామిరెడ్డిపల్లెకు చెందిన హరినాథ్‌కు అటవీ ప్రాంతానికి సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. అక్కడే పశువుల పాకను ఏర్పాటుచేసుకొని వాటిని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం పశువుల పాకలోకి వెళ్లి చూడగా ఆవు లేదు. సమీపంలోని బొగ్గుల గుట్టలో ఆవు మృతిచెంది ఉండడాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని, ఆవు కళేబరాన్ని పరిశీలించారు. ఆవుపై చిరుత దాడి చేసిన ఆనవాళ్లు ఉన్నట్టు నిర్ధారించారు. ఈ మేరకు పుంగనూరు ఎఫ్‌ఆర్వో శ్రీరాములుకు నివేదిక పంపారు. బాధిత రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కాగా ఈ ఏడాదిలో ఇలాంటివి నాలుగు ఘటనలు జరిగాయని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

జేసీబీని ఢీకొన్న కారు

– ఐదుగురికి గాయాలు



దెబ్బతిన్న కారు

పలమనేరు: జేసీబీని వేగం వచ్చిన కారు ఢీకొనడంతో కారులోని ఐదుగురికి స్వల్పగాయాలైన ఘటన పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద గురువారం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి ఓ కుటుంబం కారులో చిత్తూరు వైపు వస్తూ స్థానిక హైవేలో పక్కనుంచి వచ్చిన జేసీబీని గమనించకుండా ఢీకొట్టారు. కారు ముందు భాగం దెబ్బతింది. క్షతగాత్రులు స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు వెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

సమస్యలు ఇలా..

పరిష్కారం ఎలా?

- సంవత్సరాల తరబడి పరిష్కారం కాని అర్జీలు
- ఎన్నిసార్లు ఇచ్చినా ఒకటే సమాధానం
- ఏడాదిగా ఇదే పరిస్థితి
- కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోతున్న ప్రజలు



వివిధ ప్రాంతాల నుంచి అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన అర్జీదారులు, (ఇన్‌సెట్) సెప్టెంబర్ 23న న్యాయం చేయాలని కోరుతున్న సుబ్రహ్మణ్యం దంపతులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని అర్జీదారుల అవస్థలు అన్నీఇన్నీ కావు. వివిధ సమస్యలపై పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు అందజేసినా సకాలంలో పరిష్కారం గాక అవస్థలు పడాల్సి వస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు నెలలు, సంవత్సరాలవుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారిపోయింది. అయ్యా...న్యాయం చేయండంటూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. ఉన్నతాధికారులు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించినా క్షేత్ర అమలు కాకపోవడంతో తిప్పలు పడాల్సి వస్తోంది. ఇదేమిటని ప్రశ్నిస్తున్న అర్జీదారులపట్ల కొందరు మండల రెవెన్యూ అధికారులు 'మీకు దిక్కున్న చోట చెప్పుకోండి'.. అంటూ తెగేసి చెబుతుండడం విమర్శలకు తావిస్తోంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదాల అవస్థలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

స్పందన కరువు

తమ స్థలాన్ని అన్యాయంగా ఆక్రమిస్తున్నారని ఐరాల మండలం, బలిజపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం గత ఏడాది సెప్టెంబర్ 23వ తేదీన అధికారులకు అర్జీ ఇచ్చారు. సొంత ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మొరపెట్టుకున్నారు. 36 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాదులు వేస్తే కూల్చేశారని వాపోయారు. ఈ సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని ఎనిమిది సార్లు అధికారులకు అర్జీ ఇచ్చారు. అయితే ఏ మాత్రం స్పందన లేదు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించలేదు



గత సెప్టెంబర్ 2న విచ్చేసిన విజయ నగరం యానాది కాలనీవాసులు

కాలనీలో మౌలిక వసతులు కల్పించడం లేదని తవణంపల్లి మండలం, కట్టకిందపల్లి విజయనగరం యానాది కాలనీ వాసులు అర్జీ ఇచ్చి ఏడాదవుతోంది. ఆ కాలనీలోని 40 కుటుంబాలు సమస్య పరిష్కారం కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. ఆ కుటుంబాలకు గత ప్రభుత్వం సొంత గృహాలు నిర్మించింది. ఆ తర్వాత ప్రభుత్వాలు మారడంతో మౌలిక వసతులు లేవు. అప్పటి నుంచి అర్జీలిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. అదేవిధంగా వారి పిల్లలకు ఆధార్ కార్డులు లేక బడులకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. రేషన్ కార్డులు లేకపోవడంతో బియ్యం అందుకోలేకపోతున్నారు. వారి సమస్యలు ఇప్పటికీ అలాగే మిగిలిపోయాయి.

ప్రహరీగోడ నిర్మించలేదు



గత సెప్టెంబర్ 2న ప్రహరీగోడ నిర్మించాలని కోరుతున్న కృష్ణాపురం గ్రామస్తులు

శ్మశాన స్థలంలో ప్రహరీగోడ నిర్మించాలని తవణంపల్లి మండలం, కృష్ణాపురం గ్రామస్తులు గత ఏడాది సెప్టెంబర్ 2వ తేదీన అధికారులకు అర్జీ ఇచ్చారు. ఇప్పటికీ ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అధికారుల నివేదికల్లో మాత్రం సమస్య పరిష్కరించేశామంటూ క్లోజ్ చేశారు. ఎప్పటికైనా అధికారులు న్యాయం చేయకపోతారా..? అన్న ఆశతో అర్జీదారులు ఇప్పటికీ ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలకు పడిగాపులు



2024 సెప్టెంబర్ 23వ తేదీన ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలివ్వాలని కోరుతున్న గిరిజనులు

ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను మంజూరు చేయాలని ఎస్‌ఆర్‌పురం మండలానికి చెందిన మర్రిపల్లి ఎస్టీ కాలనీ వాసులు గత ఏడాది సెప్టెంబర్ 23న అధికారులకు అర్జీ ఇచ్చారు. అనంతరం ఏడు సార్లు మండల స్థాయి అధికారులకు అర్జీ అందజేశారు. అయితే ఇప్పటికీ వారికి న్యాయం జరగని పరిస్థితి. గత 40 ఏళ్లుగా అటవీ భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను ఇవ్వాలని వేడుకుంటూనే ఉన్నారు. వారి గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

నిందితుడి అరెస్టు



ప్రసాద్ అరెస్టు చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం: మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడ్ని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన కథనం..మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(11)ను అదేగ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి బుధవారం పాఠశాల వద్ద విడిచిపెడతానని చెప్పి నమ్మబలికాడు. బాలికను బైక్‌లో ఎక్కించుకున్న ప్రసాద్ కమ్మకండ్రిగ సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై లైంగిక దాడికి యత్నించడంతో ప్రతిఘటించింది. ఆ తరువాత జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారి ఫిర్యాదు మేరకు బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కాగా గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఇనాంకొత్తూరు సమీపంలో నిందితుడు ప్రసాద్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా?




పలమనేరులో ఓ ఇంటి వద్ద పడేసిన స్మార్ట్ రేషన్ కార్డులు

పలమనేరు: స్మార్ట్ రేషన్ కార్డులను పలమనేరులో ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారు. అసలు వీటిని ఎవరూ పంపిణీ చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పట్టణంలో గురువారం పలు వీధుల్లో స్మార్ట్ కార్డులను కొందరు ఇచ్చి మీ కార్డు ఉంటే మీరే తీసుకోండంటూ నిర్లక్ష్యంగా పడేశారు. అందుబాటులో ఉన్నవారు వారి కార్డులను తీసుకున్నారు. మరికొందరు బంధువులని, తెలిసిన వారివంటూ తీసుకెళ్లారు. పంపిణీలో నిర్లక్ష్యంకారణంగా ఎవరికైనా కార్డు లేకుండాపోతే దానికి బాధ్యులెవరని..? జనం ప్రశ్నిస్తున్నారు. దీనిపై పట్టణానికి చెందిన మోహన్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పలుకుబడి ఉంటేనే 'సార్'!

గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం గురుపూజోత్సవం రోజున అందజేసే అవార్డులకు సైతం రాజకీయ రంగు పులిమింది. పలుకబడి ఉన్న ఉపాధ్యాయులనే రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కాల్ చేసి మరీ 'మీరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులా..' అంటూ విచారించడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ అంశం జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



ఉపాధ్యాయ అవార్డులకు రాజకీయ రంగు

- ఆ ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులా?
- విచారించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు
- రాష్ట్ర అవార్డులపై సర్వత్రా విమర్శలు

చిత్తూరు కలెక్టరేట్ : గురువు స్థానానికి వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ బోధన చేస్తున్న టీచర్లను ఎంపిక చేసి అవార్డులు అందజేస్తుండడం రివాజుగా మారుతోంది. అయితే ఇటువంటి గొప్ప సంప్రదాయానికి కూటమి ప్రభుత్వం రాజకీయ రంగు పులమడం విమర్శలకు తావిస్తోంది.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులున్నారా?

జిల్లా వ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధికి చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రతిపాదనల రూపంలో సిద్ధం చేసి అందజేశారు. దరఖాస్తులు చేసుకున్న టీచర్లందర్నీ జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూలు చేపట్టింది. ఇందులో ప్రతిభ చాటిన టీచర్లు పలువురు ఉన్నప్పటికీ వారందరినీ పక్కన పెట్టేశారు. రాజకీయ పలుకుబడి, రాజకీయ సిఫార్సులున్న వారిని రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక చేసి.. మిగిలిన టీచర్లను అవమానపరిచారు.

ఇష్టానుసారంగా ఉత్తర్వులు

రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ల అవార్డులకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారంగా జారీచేశారు. మొదట్లో 1:1 ప్రాతిపదకన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆ తర్వాత 1:2 ప్రాతిపదికన ప్రతిపాదనలు పంపాలన్నారు. అదే విధంగా లీప్ యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోని టీచర్లను సైతం ఇంటర్వ్యూలకు పిలిపించుకున్నారు. అవార్డులు పొందొచ్చనే ఆశతో ఉత్తమ ప్రతిపాదనలతో జిల్లా నుంచి పలువురు టీచర్లు రాష్ట్ర స్థాయి ఇంటర్వ్యూలకు వెళ్లారు. అయితే అటువంటి వారందరినీ పక్కన పెట్టి సిఫార్సులున్న వారికి అవార్డులకు ఎంపిక చేశారని దరఖాస్తు చేసుకున్న టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి విధానం అమలు చేయలేదని వాపోతున్నారు.

పోలీసు శాఖలో మినీ ఫాల్కన్ వాహనం

– పల్లెల్లో శాంతిభద్రతల కోసం వినియోగం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా పోలీసు శాఖలో మినీ ఫాల్కన్ వాహనం అందుబాటులోకి తీసుకొచ్చారు. గురువారం చిత్తూరులోని ఆర్మ్డు రిజర్వు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ దీన్ని ప్రారంభించారు. వి.కోటకు చెందిన అమాక్స్ సంస్థ చైర్మన్ జీ.దశరథరెడ్డి ఆర్థిక సహాయంతో దీన్ని రూపొందినట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం పోలీసుశాఖ వద్ద ఉన్న ఫాల్కన్ బస్సుతో బ్రహ్మోత్సవాలు, ప్రముఖుల పర్యటన, పట్టణాలు, నగరాల్లో శాంతి భద్రతల పర్యవేక్షణ చూస్తున్నామన్నారు. ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై బస్సు వెళ్లడం కొన్ని సమయాల్లో సాధ్యం కాదన్నారు. దీంతో తమ వద్ద ఉన్న ఓ వాహనానికి కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం జోడించి మినీ ఫాల్కన్ వాహనంగా తయారు చేశామన్నారు. దీంతో గ్రామాల్లో శాంతి భద్రతలను పర్యవేక్షించడం సులువుగా ఉంటుందన్నారు. ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిషోర్, డీఎస్పీ సాయినాథ్, పోలీసు సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సీఐలు మహేశ్వర, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు



ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఫ్లకార్డులతో నూకతోటి రాజేష్, నేతలు

నాగలాపురం : రాజకీయ కుట్రతో లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం అక్రమమని సత్యవేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. గురువారం పిచ్చాటూరు బైపాస్ రోడ్డులో నిరసన తెలిపారు. అనంతరం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నూకతోటి రాజేష్ మండల నేతలతో కలిసి మిథున్ రెడ్డి త్వరగా జైలు నుంచి విడుదల కావాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ.. అక్రమ కేసులతో అరెస్టు చేస్తే పార్టీ శ్రేణులు భయపడే కాలం చెల్లిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా జగనన్న ప్రారంభించి, పూర్తి చేసిన పనులు తామే చేసినట్లు కాలం వెలిబుచ్చుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చలపతిరాజు, సీనియర్ నేత భానుప్రకాష్ రెడ్డి, ఎంపీపీ మోహన్, రమేష్ రాజు, మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, సూరి బాబు రెడ్డి, నాయకులు త్యాగరాజన్, మోహన్ రెడ్డి, ఏసు దాసు, ఆరుముగం రెడ్డి, విశ్వనాథం, వాసు, చెంచు బాబు, శేఖర్, గోవింద్, చంద్ర, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఆర్టీసీ బస్సు ఢీకొని దేవరాజు (28) అనే యువకుడు మృతి చెందాడు. నగరిలోని సత్రవాడకు చెందిన దేవరాజు ఓ ప్రైవేటు డెయిరీలో పనిచేస్తున్నాడు. గురువారం చిత్తూరుకు వచ్చిన అతను ద్విచక్ర వాహనంలో స్థానిక ఆర్టీసీ బస్సు లోపలకి వెళ్లడానికి ప్రయత్నించాడు. ఇంతలో కుప్పం నుంచి చిత్తూరు వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో దేవరాజు టైర్ కింద పడి గాయపడ్డాడు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లికి భోజనం తీసుకుని వస్తూ..



మృతిచెందిన శేఖర్

తవణంపల్లె: తిరుపతి– బెంగళూరు హైవేలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఎస్‌ఐ కథనం.. తెల్లగుండ్లపల్లె దళితవాడకు చెందిన వెంకటస్వామి కుమారుడు ఎ. శేఖర్(54) ద్విచక్ర వాహనంలో పైపల్లె క్రాస్ రోడ్డు నుంచి అతని తల్లికి భోజనం తీసుకొని ఇంటికి వస్తున్నాడు. హైవేలో నుంచి సర్వీసు రోడ్డులో రాజశేఖర్ కోళ్లఫారం దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలు తగలడంతో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తన తమ్ముడు గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతిచెందిన మురళి

పులిచెర్ల(కల్లూరు): బంధువుల ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తూ ఎదురుగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. పోలీసుల కథనం..చిత్తూరు సమీపం కొత్తూరు ఎస్టీ కాలనీకి చెందిన మురళి(40), అనూష, శరవణన్ రెండు రోజుల క్రితం పాతపేటకు ద్విచక్ర వాహనంలో బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం తిరుగు ప్రయాణంలో పాతపేట నుంచి కల్లూరు–సదుం రోడ్డుపై వెళ్తుండగా కల్లూరు నుంచి ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ద్విచక్ర వాహం నడుపుతున్న మురళి (40) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

యూరియా కొనుగోలుకు వేలిముద్రలు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రైతుల వేలిముద్రలు నమోదు చేసుకుని ఆధార్ అధీకృత విధానంలో యూరియాను కొనుగోలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని తెలిపారు. రాబోయే పది రోజుల్లో మరో 2,500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానునట్లు వెల్లడించారు.

జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూం

జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 8331057732, 8331057741 నెంబర్‌లకు కాల్ చేసి యూరియా సరఫరాలో ఇబ్బందులున్నట్లైతే ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా సబ్ డివిజన్‌ల వారీగా చిత్తూరు డివిజన్ 8331057748, పలమనేరు 833105779, పుంగనూరు 8331057746, నగరి 8331057750 నెంబర్‌లకు కాల్ చేసి ఫిర్యాదులు చేయొచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎస్వీయూకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ)కు ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌ఓ) గుర్తింపు లభించింది. గురువారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఐఎస్‌ఓ బృందం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ధ్రువపత్రాలను అందజేసింది. విద్యా నైపుణ్యం, స్థిరత్వం , సమగ్రాభివృద్ధి, నిబద్ధత వంటి అంశాలపై ప్రగతి సాధించినందుకు ఈ గుర్తింపు లభించింది.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 70,472 మంది స్వామివారిని దర్శించుకోగా 25,247 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టిక్కెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన వారిని క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

బాల్య వివాహాలు నివారిద్దాం



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

పలమనేరు: బాల్య వివాహాల నివారణపై క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖలు దృష్టి సారించాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో బాల్యవివాహాల నివారణ, లైంగిక నేరాల చట్టాలపై వివిధ శాఖలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల విషయంలో అంగన్‌వాడీ వర్కర్ల పాత్ర చాలా కీలకమన్నారు. గ్రామ స్థాయిలో దీనిపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌డీఓ భవాని మాట్లాడుతూ బాల్య వివాహాలతో జరిగే నష్టాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వరి, లీగల్ ఆఫీసర్ వెంకటేశులు, శివశంకర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ నాగమణి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జయరాముడు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.